క్లుప్తంగా

శ్రీనివాసులుకు డాక్టరేట్



అల్లూరు: అల్లూరుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బంకా శ్రీనివాసులుకు డాక్టరేట్ లభించింది. తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మనో విజ్ఞాన శాస్త్ర విభాగ ప్రొఫెసర్ ఎస్ విశ్వనాథ్ రెడ్డి పర్యవేక్షణలో 'కాగ్నిటివ్ స్టైల్స్ ఇన్ రిలేషన్ టు క్రియేటివిటీ మెంటల్ హెల్త్ అండ్ అడ్జెస్ట్మెంట్ అమాంగ్ హైస్కూల్ స్టూడెంట్స్' అనే అంశంపై ఆయన పరిశోధనలు సాగించి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఇందుకుగానూ వర్సిటీ తనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బంకాను సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



మర్రిపాడు: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు ఆర్డీఓ కే మధులత హెచ్చరించారు. మండల తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ప్రభుత్వ భూమిని తహసీల్దార్ సీతారత్నంతో కలిసి ఆర్డీఓ గురువారం పరిశీలించారు. ఓ వ్యక్తి తనకు కేటాయించిన స్థలాన్ని మించి ప్రభుత్వ భూమిని ఆక్రమించడాన్ని గమనించిన ఆర్డీఓ కేటాయించిన భూమిలోనే ఇంటిని నిర్మించుకోవాలని, మిగిలిన భూమిని విడిచి పెట్టాలని సూచించారు. మరో వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రేకులషెడ్ నిర్మించడాన్ని పరిశీలించి తొలగించి స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

ఆవుల వేలం



కొండాపురం: మండలంలోని చింతలదేవి మిశ్రమ పశుగణాభివృద్ధి క్షేత్రంలోని ఒంగోలు జాతి ఆవులను డీఎల్‌డీఏ చైర్మన్ విజయ కుమార్ ఆధ్వర్యంలో గురువారం వేలం వేశారు. 50 ఆవులకు వేలం నిర్వహించగా 47 ఆవులను రూ.10.12 లక్షలకు రైతులు దక్కించుకున్నట్లు క్షేత్రసిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జేడీ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



కావలి: ఆంధ్రప్రదేశ్ ఆల్ మైనార్టీస్ సెంట్రల్ అండ్ స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కావలికి చెందిన షేక్ మునీర్‌జాన్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ ఫెడరేషన్ రాష్ట్రాధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ చేతుల మీదుగా గురువారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మునీర్‌జాన్ మాట్లాడుతూ మైనార్టీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



సంగం: కారు ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సంగంలోని ఎంజీఆర్ బ్యారేజ్‌పై గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పొదలకూరు మండలం సూరాయపాళేనికి చెందిన గోపాల్ పని నిమిత్తం సంగం వచ్చాడు. తిరిగి బ్యారేజ్‌పై నడుచుకుంటూ వెళ్తుండగా సంగం నుంచి పొదలకూరు వైపు వెళ్తున్న కారు వెనుకగా ఢీకొంది. దీంతో గోపాల్ తలకు తీవ్ర గాయం కాగా సంగం 108 వాహన సిబ్బంది నెల్లూరులోని వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి కోదండరాముని ఉత్సవాలు

చేజర్ల: స్థానిక పడమటి వీధిలోని రామాలయంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు కోదండరాముని ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. 19న విశేషాభిషేకాలు, పూజలు, 20న కల్యాణోత్సవం, 21న ఉట్టి మహోత్సవం, పార్వేట ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

కాలువలు ఇలా..

సాగునీరు పారేదెలా?

నియోజకవర్గంలో 159 చెరువులు
- వాటి పరిధిలో అధ్వానంగా పంట కాలువలు
- సాగుకు ముందే పూడికతీత చేపట్టాలని రైతుల విజ్ఞప్తి

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం. గతంలో వర్షాలపై ఆధారపడి చెరువుల కింద రైతులు సాగు చేపట్టేవారు. ఇటీవల సోమశిల జలాలపై ఆధారపడి సాగు చేపడుతున్నారు. నియోజకవర్గంలో మొత్తం 159 మేజర్, మైనర్ చెరువులు ఉన్నాయి. వాటి పరిధిలో అధికారికంగా, అనధికారికంగా సుమారు 25వేలకుపైగా ఎకరాల ఆయకట్టు ఉంది. కొన్ని చెరువులకు సోమశిల ఉత్తర కాలువ, మరికొన్ని చెరువులకు సోమశిల దక్షిణ కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. అయితే చెరువుల నుంచి ఆయకట్టుకు సాగునీరు అందించే కాలువలు అధ్వానంగా మారాయి. కట్టలు దెబ్బతినడంతో పాటు పూడికతో నిండి ఉన్నాయి. సంగం మండలంలోని మేజర్‌కాలువలు దువ్వూరుకాలువ, అనంతసాగరం మండలంలోని దిగువకాలువ, వెన్నెల కాలువలు దుస్థితిలో ఉన్నాయి. ఆత్మకూరు మేజర్ చెరువు కింద సుమారు 6500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువు కింద పంట కాలువలు అధ్వానంగా ఉన్నాయి. మరో రెండు నెలల్లో రబీ సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాలువల దుస్థితిని చూసి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. అదే క్రమంలో సాగునీటికి డిమాండ్ ఏర్పడుతోంది. పంట కాలువలు సక్రమంగా లేని కారణంగా సాగునీరు వృథావుతోంది. చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు సజావుగా అందక పంటలు ఎండిపోతున్న పరిస్థితులు ఉంటున్నాయి. అందువల్ల ఇరిగేషన్ అధికారులు సాగుకు ముందే పంట కాలువలను పరిశీలించి మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



పూడికతో నిండిన తరుణవాయి కాలువ



అధ్వానంగా అనంతసాగరం దిగువ కాలువ



సంగం మండలంలోని దువ్వూరు కాలువలో పెరిగిన జమ్ము, కంపచెట్లు



ఏఎస్‌పేట మండలంలో దెబ్బతిన్న సాగునీటి కాలువ

దుస్థితిలో చెరువులు

చేజర్ల, ఏఎస్‌పేట మండలాల్లోని పలు చెరువులు దుస్థితిలో ఉన్నాయి. చెరువులు పూడికతో నిండి వాటి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో పంటలకు చివరి దశలో సాగునీరందడం లేదు. ఆత్మకూరులోని మేజర్ చెరువు సైతం పూడికతో నిండడంతో పూర్తి స్థాయిలో నీరు నిలవడంలేదు. దీనికితోడు ఐదు తూముల కలిగిన చెరువు కట్ట సైతం కొన్ని చోట్ల కుంగిపోయి ఉంది. 3వ నంబరు తూము, గుడ్డి తూము, నువ్వూరుపాడు తూములు దెబ్బతిని ఉన్నాయి. ఇరిగేషన్ అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గతంలో మేకపాటి కుటుంబం సొంత నిధులతో..

గతంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి తన సొంత నిధులతో పంట కాలువల్లో పూడికతీత పనులు చేయించారు. గతేడాది అప్పటి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సైతం ఆత్మకూరు, చేజర్ల, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల్లోని సాగునీటి కాలువల్లో పూడికతీత పనులను తన సొంత నిధులతో చేయించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కాలువలను పరిశీలించి నివేదికలు రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సాగుకు ముందే పూడికతీత పనులు చేపట్టాలి



అనంతసాగరం మేజర్ చెరువు కింద పంట కాలువలు మరమ్మతులకు గురికావడంతో పాటు పూడికతో నిండి ఉన్నాయి. ఈ కారణంగా సాగునీరు సజావుగా అందడం లేదు. ఎడగారు సాగు చేస్తున్న కొందరు రైతులు కాలువలను సొంతంగా తవ్వించుకున్నారు. ఇరిగేషన్ అధికారులు పంట కాలువలను పరిశీలించి రానున్న రబీ సీజన్‌కు ముందే పూడికతీత పనులు చేపట్టాలి.

– ఎం మల్లికార్జునరెడ్డి, దేవరాయపల్లి, అనంతసాగరం మండలం

సాగునీటికి ఇబ్బందులు తప్పవు



సంగం మండలంలోని అన్ని సాగునీటి కాలువలు పూడికతో నిండి ఉన్నాయి. ఇరిగేషన్ అధికారులు పరిశీలించి రబీ సాగుకు ముందే పూడికతీత పనులు చేపట్టాలి. లేకపోతే రైతులకు సాగునీటి ఇక్కట్లు తప్పవు. రైతుల సమస్యను ప్రజాప్రతినిధులు గమనించి ముందస్తు చర్యలు తీసుకోవాలి.

– జనార్దన్‌రెడ్డి, సంగం

మండలాభివృద్ధికి సమష్టిగా కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణయ్య

జలదంకి: అధికారులు, ప్రజా ప్రతినిధుల సమష్టిగా మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మండలాధికారులు తమ శాఖల పరంగా జరిగిన అభివృద్ధి పనులు, చేపట్టనున్న పనులను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల పరిధిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ రామచంద్ర మాట్లాడుతూ గ్రామాల్లోని తాగునీటి, డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. మండల సమావేశానికి గైర్హాజరైన అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండల పరిషత్ నిధులు రూ.55 లక్షలతో చేపట్టనున్న పదకొండు పనులకు సంబంధించిన తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీలు పాలవల్లి మాలకొండారెడ్డి, మేకల ధనమ్మ, ఎంఈఓలు శ్రీధర్, నాగేశ్వరరావు, హౌసింగ్ ఏఈ ప్రసాద్, ఏపీఎం శ్రీధర్, ఏపీఓ శ్యామల, ఏఓ శైలజ, పీఆర్ ఏఈ వాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఆర్టీసీ సూపర్‌లగ్జరీ సర్వీసు ప్రారంభం



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి: ఉదయగిరి డిపోలో హైదరాబాద్‌కు కొత్త సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం ప్రారంభించారు. ఉదయగిరి నుంచి హైదరాబాద్‌కు ఇప్పటికే మూడు సర్వీసులు నడుస్తుండగా, అదనంగా నాల్గో సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని పలువురు కోరారని తెలిపారు. ఈ మేరకు త్వరలో ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని పల్లెలకు బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు త్వరలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందని తెలిపారు. అనంతరం ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ అందిస్తున్న వైద్యసేవలపై రోగులను ఆరాతీశారు. ఈ సందర్భంగా పలువురు రోగులు ఎక్స్‌రే పనిచేయని విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వైద్యశాలలోని సౌకర్యాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వైభవంగా కలిగిరమ్మ తిరునాళ్ల



కలిగిరి: కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మ తిరునాళ్లను గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయగిరి కలిగిరమ్మను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కలిగిరి, పాపనమునిసిపాళెం, జిర్రావారిపాళెం గ్రామాల భక్తులు అమ్మవారి ఆలయం చుట్టూ బండ్లు తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ఆలయం వద్ద సూడిమానును తిప్పడంతో ఉత్సవాలు ముగిశాయి.



కలిగిరమ్మ దర్శనానికి బారులుతీరిన భక్తులు

21న గురుపౌర్ణమి వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో ఈ నెల 21న గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ మందిర కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం కాకడ హారతి, విశేష పూజలు, 11 గంటలకు గురుపౌర్ణమి ప్రాశస్త్యంపై రామయ్యస్వామి ప్రవచనం, 12 గంటలకు మహాహారతి, ప్రసాద వినియోగం, సాయంత్రం సంధ్యా హారతి, విష్ణు సహస్రనామ పారాయణం, 7.30 గంటలకు భజనలు, రాత్రి 9 గంటలకు పల్లకిసేవ, శేజ్ హారతి నిర్వహించనున్నట్లు వివరించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

కలిగిరి: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించామని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు తెలిపారు. నాగసముసముద్రం పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లోని మురుగు, చెత్త నిల్వలను తొలగించి బ్లీచింగ్ చల్లిస్తున్నామని తెలిపారు. రక్షిత మంచినీటి పథకం ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయిస్తున్నామని చెప్పారు. పారిశుధ్యం మెరుగునకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎంపీడీఓ వెంట ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, పంచాయతీ కార్యదర్శి మధు ఉన్నారు.

సీసీఆర్ కార్డులతో బహుళ ప్రయోజనాలు

సోమశిల: పంట సాగుదారు హక్కు (సీసీఆర్) కార్డులతో కౌలురైతులకు బహుళ ప్రయోజనాలు లభిస్తాయని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ తెలిపారు. అనంతసాగరం మండలంలోని లింగంగుంట రైతు సేవా కేంద్రంలో సీసీఆర్ కార్డులపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీఆర్ కార్డులతో బ్యాంకు రుణాలు పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే విత్తనాలు, పంట బీమా, తదితర పథకాలను పొందవచ్చని వివరించారు. కౌలు రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏఓ శ్రీనివాస్ చక్రవర్తి, వీఏఏ నాగేంద్ర పాల్గొన్నారు.

చేజర్ల: మండల వ్యవసాయాధికారి శశిధర్ ఆధ్వర్యంలో వావిలేరు, పాడేరు గ్రామాల్లో సీసీఆర్ కార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏలు సూర్యనారాయణ, కౌసల్య, వీఆర్వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మర్రిపాడు: మండలంలోని బ్రాహ్మణపల్లి రైతు సేవా కేంద్రంలో ఏఓ ఎస్ రామ్మోహన్ సీసీఆర్ కార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏ ఎస్ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో కంది విత్తనాలు

సీతారామపురం: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఎల్‌ఆర్‌జీ–52 రకం కంది విత్తనాలు ఐదు క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఏఓ చెన్నారెడ్డి గురువారం తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో జూలై నుంచి ఆగస్టు వరకు కంది పంట విత్తుకోవచ్చని చెప్పారు. 160 రోజుల పంట కాలపరిమితి కలిగిన ఈ రకం విత్తనాల ధర కేజీ రూ.97.80 మాత్రమేనని చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు వీఏఏలను సంప్రదించాలని సూచించారు.

డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు వినతి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు, ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయాలి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు స్థానికులు గురువారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే వింజమూరులో డయాసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ముగిసిన మొహర్రం వేడుకలు



చేజర్ల: పుట్టుపల్లిలో పీర్ల ఊరేగింపు

మర్రిపాడు: మండలంలోని నందవరంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు పీర్లను గ్రామంలో ఊరేగించారు. మతసామరస్యానికి ప్రతీకగా గ్రామస్తులందరూ మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలోని పుట్టుపల్లిలో నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు పీర్ల చావిడి వద్ద పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీర్లను గ్రామంలో ఊరేగించారు.

అశ్లీల నృత్యాల ప్రదర్శన

వరికుంటపాడు: మండలంలోని మంగాపురంలో పోలేరమ్మ జాతర సందర్భంగా బుధవారం అర్ధరాత్రి అశ్లీల నృత్యాలను ప్రదర్శించారు. ఇదే తరహాలో గత నెలలో కొండ్రాజుపల్లి, కొండాపురం మండలం అదిమూర్తిపురం,రేణుమాల గ్రామాల్లోనూ అశ్లీల నృత్యాలను ప్రదర్శించినట్లు సమాచారం. అశ్లీల నృత్యాల దృశ్యాలు సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతున్నాయి. అశ్లీల నృత్యాలపై నిషేధం ఉన్నప్పటికీ వాటిని ప్రదర్శిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నారు.

జీపీఎస్‌ను రద్దు చేయాలి

అనుమసముద్రంపేట: ఉపాధ్యాయులకు జీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదును గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, నివేదిక వచ్చేంత వరకు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆగస్టు 10న నెల్లూరులోని పురమందిరంలో నిర్వహించే ఏపీటీఎఫ్ జిల్లా మహాసభల్లో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, శివకుమార్‌రెడ్డి, ఫణికుమార్, రాఘవరెడ్డి, ప్రభుదాస్, సుధాకర్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ



ఆత్మకూరులో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ



ఉదయగిరిలో ...

ఆత్మకూరు: హెల్మెట్ ధారణతో ప్రాణాలను కాపాడుకోవచ్చని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ సూచించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. కళాశాల విద్యార్థులతో కలిసి న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద నుంచి మున్సిపల్ బస్టాండ్, సోమశిల రోడ్డు సెంటర్, తహసీల్దార్ కార్యాలయం మీదుగా ఆర్టీసీ డిపో వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్జి రాజేష్ పాల్గొని మాట్లాడారు. హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపితే కేసులు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. న్యాయసేవాధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఎల్‌వీ రమణయ్య, షేక్ నజీర్, కేవీ శేషారెడ్డి, బ్లడ్ బ్యాంకు కార్యదర్శి సాధిక్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి

ఉదయగిరి: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి అంజయ్య సూచించారు. ఉదయగిరి బస్టాండ్ సెంటర్ నుంచి కోర్టు వరకు పోలీసులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ప్రజలతో కలిసి హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. న్యాయవాదులు రామారావు, మస్తాన్, తిరుపతయ్య, నాగార్జున, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్‌పేటలో ఓ మోస్తరు వర్షం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. మధ్యాహ్నం వేళ ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం పడింది. దీంతో దర్గా దర్శనానికి వచ్చిన వేలాది మంది రొట్టెల పండగ భక్తులు ఇబ్బందులు పడ్డారు. తలదాచుకునేందుకు వీల్లేక వర్షంలోనే తడిచారు.

ఉదయగిరి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం చిరుజల్లులు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడినా చెరువుల్లో నీరు మాత్రం చేరలేదు. మంచి వర్షాలు కురిస్తే ఖరీఫ్ సాగుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న చిరుజల్లులు పండ్ల తోటలకు కొంతమేర ఉపశమనం కల్పిస్తున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

సోమశిల: అనంతసాగరం మండలంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇటీవల రైతులు వరి నాట్లు వేశారు. ఖరీఫ్ పంటకు వర్షం మేలు చేకూరుస్తుందని రైతులు పేర్కొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

సంగం: డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. సంగం బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు డయేరియా నివారణ చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. డాక్టర్ అశోక్‌కుమార్ గురుకుల పాఠశాలలోని వాటర్ ట్యాంక్‌ను పరిశీలించి విద్యార్థులకు డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కొత్తూరు ప్రాంతంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ, పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఖాదర్‌బాషా, పంచాయతీ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మకు విశేష పూజలు

కొండాపురం: మండలంలోని గొట్టిగుండాలలో కొలువైన కోట అంకమ్మతల్లికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలు నిర్వహించి నెలరోజులు పూర్తయిన సందర్భంగా . ఇస్కదామెర్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుంజి ఏడుకొండలు ఆధ్వర్యంలో అంకమ్మతల్లిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులురెడ్డి, స్థానిక ఎంపీటీసీ వేమిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు యడ్లపల్లి వెంకటరమణయ్య, అన్నం వెంకటసుబ్బయ్య, నరేష్, కమలాకర్, రాజా, పరుచూరి మాల్యాద్రి, సత్యవోలు, గానుగపెంట ఎంపీటీసీలు లెక్కల వెంకటరమణయ్య, బంకా మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజ నిర్మాణానికి కృషి

వరికుంటపాడు: కుష్టు రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారిణి కరీష్మా, సీహెచ్ఓ రాజశేఖర్‌రాజు అన్నారు. మండలంలో వైద్యఆరోగ్య సిబ్బంది చేపడుతున్న కుష్టు సర్వేను గురువారం వారు పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. కుష్టును ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చని వివరించారు. చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, నొప్పితో కూడిన నరాలు, తిమ్మిర్లు, నొప్పిలేని పుండ్లు, తదితరాలు కుష్టు లక్షణాలని తెలిపారు. ఈ లక్షణాలు కలిగిన వారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో కెనరా బ్యాంకు ఆర్‌ఎం

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులో నూతనంగా నిర్మించిన పద్మావతి, గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ నాగరాజు, వరికుంటపాడు బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్ గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు భార్గవ రామాచార్యులు, సీతారామాచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ శాలువాలతో సత్కరించి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు.